
# కాంట్రాక్టర్లు పార్టీలు

— బోయ జంగయ్య



అది డివిజనల్ ఇంజనీరు ఆఫీసు. కాంట్రాక్టర్ల కదలిక తప్ప స్టాఫ్ ఎవరి పనిలో వాళ్ళు నిమగ్నమై ఉన్నారు. చాయ్‌వాలా ఓ చేతిలో ఫ్లాస్క్ మరో చేతిలో ఓ చిన్న బకెట్‌లో గ్లాసులతో తిరుగుతున్నాడు.

కాంట్రాక్టర్ లోపలికొస్తూ హెచ్‌డికో నమస్కారం పెట్టి పక్కకు చూసి-

"నమస్కారం ఇంజనీరుగారూ" అన్నాడు నవ్వు ముఖంతో.

ఇంజనీరు ప్రతి నమస్కారం చేయలేదు, అతనివైపు చూడలేదు.

"అయ్యా తమరికే నమస్కారాలు" అంటూ చేతులు జోడించాడు.

మౌనంగా చూశాడే తప్ప మాట్లాడలేదు.

"ఏం సార్, ఏమిటి సంగతి, ఆయన ఎన్నిసార్లు నమస్కారం అన్నా గానీ చప్పుడు కూడా చేయటం లేదు ఏం జరిగింది?" అన్నాడు హెచ్.డి.

'ఏం జరగలేదు సార్' అన్నట్టు చూశాడు.

"నాకయితే తెలవదుసార్ అయ్యావారికే తెలిసుండాలి" అంటూ పక్క రూమ్‌లోకి నడిచాడు.

"ఏం సార్, ఏ జరిగిందో చెప్పండి. నా దగ్గరో చెక్ ఉంది. గొళ్ళెం పెట్టమంటారా" అన్నాడు ఇంజనీరువైపు చూస్తూ.

"అంత పనెందుకు లేండి, ఆయన సంగతి నేను చూసుకుంటాగా."

"చూసుకునేటంత పెరిగిందా ఏమిటి?" రాసేది ఆపి అతని వైపు చూశాడు.

"ఏదో ఒకటి జరిగిందిలే" అంటూ గీస్తున్న నక్షాను అటు ఇటు తిప్పి చూస్తున్నాడు.

"అదే ఏం జరిగిందా అని?" క్యూరియాసిటీగా అడిగాడు.

"నిన్న ఈవినింగ్ ఆఫీసుకు వచ్చాడుగా."

"వచ్చాడు, నన్ను బయటికి పోదాం రమ్మన్నాడు, నాకు పని ఉంది, రాలేను అన్నాను."

"రానిదే మంచిదైంది" అని చాయ్‌వాలా వైపు చూసి, "రెండు" అన్నాడు ఇంజనీర్.

చాయ్‌గ్లాసులను అందించి పైసలను తీసుకొని పక్కరూమ్‌లోకి వెళ్ళాడు చాయ్‌వాలా.

"ఆఁ చెప్పరూ, రానిది ఎందుకు మంచిదయింది?"

"ఏం జరిగింది అంటే" చాయ్‌ను చప్పరిస్తూ చెప్పసాగాడు....

★ ★ ★

రెస్టారెంట్ గేటు ముందు మోటార్‌సైకిల్ ఆగింది.

వెనక కూర్చున్న నడి వయస్సు వ్యక్తి ముందుగా దిగాడు. ఆయన నల్లగున్నా ఆయన వేసుకున్న చొక్కా, ధోవతి తెల్లగున్నాయి. ఆయన సంకలో బ్యాగ్ ఆయన రంగు లాగే ఉంది. కాంట్రాక్టర్ బండి నడిపితే జనరల్‌గా వెనుక కూర్చునేది ఇంజనీర్. అలా కాకుండా కాంట్రాక్టరే వెనుక కూర్చున్నాడు.

అది సాయంత్రపువేళ.

ఇంజనీర్ వయస్సు కాంట్రాక్టర్ వయస్సే కానీ ఈయన రంగు ఛామనఛాయ. నున్నగా షేవ్ చేసుకున్నాడు. బండికి లాక్‌చేసి, ముందు కాంట్రాక్టర్ వెనుక ఆయన రెస్టారెంట్‌లోకి నడిచారు. మన రాష్ట్రంలో బార్లకు అనుమతిలేదు కనుక రెస్టారెంటుల్లోనే స్నాక్స్‌తో పాటు డ్రింక్స్‌ను కూడా సరఫరా చేస్తూ ఉన్నారు. మిగతా పట్టణాల సంగతి ఏమో గానీ ఈ పట్టణంలో తాగుడుకు ఏ కట్టుబాట్లు లేవు. అందువల్ల ఈ పట్టణపు ప్రభుత్వ కార్యాలయాల్లో అన్ని పనులు సజావుగానే సాగుతున్నాయి.

రెస్టారెంట్ కాంపౌండ్ గోడకు పెప్సీబాటిల్ బొమ్మలు ప్రచారం కోసం పెయింట్ చేయించారు. లోపలికి నడిచి ఓపెన్ ఏరియాలో ఉన్న ఓ టేబిల్ ముందు కూర్చున్నాడు. ఒకటి రెండు టేబిల్స్ తప్ప అన్ని టేబుల్స్ వద్ద కస్టమర్స్ కూర్చొని ఉన్నారు. బాయ్స్ ఉరుకుల పరుగుల మీద సర్వ్ చేస్తున్నారు. వెయిటర్స్ నింపాదిగా నిలుచొని ఆహార పదార్థాల ఆర్డర్స్ తీసుకుంటూ ఉన్నారు.

"చెప్పండి సార్, ఏం తీసుకుంటారు?" ట్రేలో బోర్లించి ఉంచిన అద్దపు గ్లాసులను నిలబెడుతూ అడిగాడు కాంట్రాక్టర్.

"మీ ఇష్టం" అన్నాడు ఇంజనీర్ మగ్గులోని నీళ్ళను గ్లాసుల్లోకి పంచుతూ.

ఈలోగా వెయిటరొచ్చి నిలుచున్నాడు.

"చెప్పండి సార్" అన్నాడు కాంట్రాక్టర్.

"పార్టీ నాదైతే మీరు చెప్పాలి, మీదైతే నేను చెప్పాలి" అన్నాడు ఇంజనీర్.

"కాంట్రాక్టర్ ఉన్నాక ఇంజనీర్‌ను ఇవ్వనిస్తాడా?"

"రెడ్ నైట్ ఆఫ్, రెండు సోడాలు" ఆర్డర్ ఇచ్చాడు కాంట్రాక్టర్.

"స్నాక్స్ ఏం తేవాలి" వెయిటర్ అడిగాడు.

"ఏమేమి ఉన్నాయి స్వామీ?" అన్నాడు అతని డ్రస్ చూసి.

"అన్నీ ఉన్నాయి స్వామీ, చిల్లి చికెన్, మటన్ మంచూరియా, స్వామీ."

"చిల్లి చికెన్ ఓటిస్వామీ" చెప్పాడు కాంట్రాక్టర్.

"మీరు మాల వేసుకున్నారు కనుక మిమ్మల్ని స్వామీ అనవచ్చు. కానీ మీరు మమ్మల్ని స్వామీ అని ఎందుకంటారు స్వామీ." అడిగాడు నారాయణ.

"నాకు తెలియదు స్వామీ, గురుస్వామీ అందరిని స్వామీ అనాలి అని చెప్పారు. ఆయన్ని అడిగి చెపుతాను స్వామీ" అంటూ అక్కడి నుండి నడిచాడు.

"ఏం తెలుసుకోకుండానే రామయ్య మాల వేసుకుంటే సోమయ్య వేసుకుంటాడు" అన్నాడు నారాయణ.

పోనీ, పోనీ అన్నట్టు చూశాడు ఇంజనీర్.

"ఇంజనీర్ సాబ్, కాస్త నన్ను కనిపెట్టండి, సేదోణ్ణి" అన్నాడు వినయంగా.

ఇంజనీర్ మౌనంగా నీళ్ల గ్లాసును అందుకొని పుక్కిలించాడు.

"కొత్త స్కీమ్ వస్తున్నదట. మీరు నా మీదో కన్నుంచకపోతే కలిసేరాదు. మీది మీకు పువ్వుల్లో పెట్టిఇస్తాను, ఇస్తున్నానా లేదా?" అని అడిగాడు.

రెడ్‌నైట్ టేబిల్ మీదుంచి, రెండు సోడాల మూతలు తీశాడు బాయ్.

రెండు గ్లాసుల్లో విస్కీ పోసి, సోడాను పంచాడు. ఇంజనీర్‌కోటిచ్చి తానొక గ్లాసును తీసుకొని, గ్లాసులోని విస్కీని రెండు చుక్కలు నేల మీద చల్లి భూమిపూజ చేశాడు కాంట్రాక్టర్.

"ఛీర్స్" అన్నాడు ఇంజనీర్.

ఇద్దరు ఒక్కసారే పెదాలను తడుపుకున్నారు.

ఒకరిని ఒకరు చిరునవ్వుతో చూసుకున్నారు.

"నా దగ్గర పని చేసిన వాళ్ళు ఎవరు చెడిపోరు"

"అదే అంటున్నా, నన్నైతే కనిపెట్టండి" మళ్ళీ అన్నాడు కాంట్రాక్టర్.

"చూద్దాం" అంటూనే గొంతు దిగలేదు, మొదలైంది కథ" అని మనస్సులోనే అనుకున్నాడు.

"మీ దయ" అని బయటికి అని "చూడమనే కదా ఇక్కడికి తీసుకొచ్చింది" అని లోలోన అనుకున్నాడు.

"మన ఇ.ఇ. అయితే మంచోడు కాదు సార్" పెదవులను బిగించి వదులుతూ అన్నాడు.

"నిన్ను బాగానే చూస్తాడు కదయ్యా" అంటూనే ఇద్దరు దొంగలే అనుకున్నాడు.

"చూస్తే ఏం లాభం, మంచి పనోటి నామినేషన్ మీద ఇవ్వాలి గానీ, ప్రతిదానికి టెండరే నాయె" అన్నాడు గ్లాసు ఖాళీ చేస్తూ, ఈలోపల వేడి వేడి చిల్లీ చికెన్ వచ్చింది.

"ఇంకేమయినా" అడిగాడు వెయిటర్ ప్యాడ్ మీద పెన్నుంచి, కస్టమర్ మీద కన్నుంచి.

"మటన్ మంచూరియా" అన్నాడు ఇంజినీర్.

అది రాసుకొని అక్కణ్ణించి కదిలాడు వెయిటర్.

'అచ్చా ఆర్డర్ తానే ఇస్తున్నాడే, బిల్ ఇచ్చేది నేను కదా. తాను ఇచ్చే వాడిలాగా ఆర్డర్ ఇస్తున్నాడే. మేసే దగ్గర బాగానే మేస్తారు. చేసే దగ్గర చేయరు. మీ ఇంటికొస్తే ఏమిస్తవు? మా ఇంటికొస్తే ఏం తెస్తవు? అనే ధోరణి వీళ్ళది' అని అనుకున్నాడు.

ఇంజనీర్ మౌనంగా సిప్ చేస్తూ ఉన్నాడు. అది చూసి కాంట్రాక్టర్.

"ఏం సార్, ఏదో ఆలోచిస్తున్నారు, నా గురించేనా? అని అడిగాడు.

"కాదు, పొద్దున ఇ.ఇ. గారికి, నాకు కొంచెం గొడవ జరిగింది" అన్నాడు.

'తాగేది ఒకడి సొమ్ము, ఆలోచించేది మరొకడి గురించా?' అనుకుంటూ.

"మన ఇ.ఇ. తోటి గొడవ జరగంది ఎవరికి? పట్టిపెచ్చోడు. ఆయనకు పనికన్నా పైసలే ముఖ్యం. ఆఖరికి ఆయన పెళ్ళాం కూడా ఏదన్నా వర్కు చేయించినా పర్సంటేజి ఇవ్వంది చెక్ మెజర్ కాదు" అంటూ ఖాళీ అయిన గ్లాసుల్లో విస్కీ వంచి సోడా కలిపాడు.

"ఆమేమి తక్కువది కాదులే, ఆమె పెట్టే టెండరు ఆమె పెడుతూనే ఉంటది. అది తెలిసే వాళ్ళకే తెలుస్తుంది" అన్నాడు కాంట్రాక్టర్.

పక్క టేబిల్‌మీది పార్టీ గ్లాసుతో సౌండ్ చేశాడు. బేరర్ కోసం.

"సార్" అంటూ వెళ్ళి నిలుచున్నాడు.

"ఏమి, ఎన్నిసార్లు పిలవాలి, మీ సేట్‌తో పాటు నీకు కూడా బాగా బల్సిందిరా. ఆ



ముఖ్యమంత్రి పుణ్యమా అని మీరు కట్టలు కమాయిస్తూ ఉన్నారు. బార్లకు పర్మిషన్ ఇవ్వక పోవడం మీకు భాగ్యమైపోయింది. లైసెన్సమో వైన్స్‌దాయె. నడిపేదేమో బారాయె. రెస్టారెంట్ అని పక్కనే తెరిచి ఇట్లా ఇంత బాహాటంగా...పోలీసులొస్తే తెలుస్తదిర" అన్నాడు.

మనిషి సన్నగా ఉన్నాడు. ఎరుపురంగే కానీ కళ్ళదగ్గర నలుపుగా ఉంది. మనిషిని చూసి తాగుబోతని గెస్ చేయొచ్చు. కదులుతూ ఓసారి కళ్ళను మూసి తెరిచాడు.

బేరర్ నవ్వాడు.

"నవ్వుతున్నావుర, నవ్వే మాటన్నానుర నేను" అని గ్లాసును టేబిల్‌మీద కొడుతూ, పెదవులను బిగపట్టి పళ్ళు కొరికాడు.

మళ్ళీ నవ్వాడు బేరర్.

"అరె సార్‌కు కొంచెం" అంటూ కన్నుగీటాడు ఆయనతో పాటు కూర్చొని పార్టీ ఇస్తున్న వ్యక్తి నల్లగా, లావుగా ఉన్నాడు. పాన్ తినటం వల్ల పళ్ళు గారపట్టాయి.

"అరె నీవెందుకుర నవ్వేది చెప్పు. చెప్పక పోతే బిల్ ఇవ్వను" అన్నాడు.

"మీరే ఇస్తారు, తాగినంక బిల్ ఎందుకు ఇవ్వరు సార్" ముసిముసిగా నవ్వుతూ అన్నాడు. బేరర్‌ది మంచి విగ్రహం, తెల్లరంగు, నూనూగుమీసాలు.

"మరి ఎందుకు నవ్వావో చెప్పాలి అంతే" టేబిల్ మీద వేళ్ళతో కొడుతూ.

"మీరు పోలీసోళ్ళు వస్తరంటే" ఈసారి వస్తున్న నవ్వును ఆపుకొని ఆయనవైపు కాకుండా, నల్లని వ్యక్తివైపు చూస్తూ మాట్లాడుతున్నాడు.

"అంటే?"

"మొన్నొకాయన బిల్ దగ్గర గొడవొచ్చి పోలీసులకు ఫోన్ చేసిండు సార్" ఈసారి అతని షర్ట్‌పై భాగపు గుండీని చేత్తో అటూ ఇటూ అంటూ అన్నాడు.

"చేస్తే" సీరియస్‌గా చూస్తూ అడిగాడు.

"పోలీసులొచ్చారు సార్" అన్నాడు తన రెండు చేతులని వెనక్కు పెట్టుకొని.

"వచ్చి" అదే సీరియస్‌గా అడిగాడు.

"ఆయన్నే పట్టుకుపోయిండ్రు సార్" ఈసారి వాడు టేబిల్ మీద డ్రింక్ వైపు దృష్టి ఉంచి అన్నాడు.

"అట్లెట్ల, మిమ్మల్నేమనలేదా?" అంతకు ముందున్న సీరియస్‌నెస్ కొంచెం తగ్గింది. వళ్ళంతా చెమట పట్టింది. నీళ్ళ గ్లాసునందుకొని కాసిని నీళ్ళను మింగి వెనక కాలర్‌ను పైకెత్తుకున్నాడు.

"అనలేదు సార్. మా సేటును వంద రూపాయలు అడుక్కొని, ఫోన్ చేసినాయన్ను 'తినవలసిన చోట తాగుతున్నావు, పద పోలీస్‌స్టేషన్‌కు" అని పట్టుకపోయారు సార్" అన్నాడు.

"అంటే నన్నూ పోలీసులకు పట్టిస్తానంటవు" అన్నప్పుడు అంతకుముందు తాగింది కొంత దిగిపోయి, నాలుక ఎండిపోయింది.

"పోనీ రెడ్డీ, మనం వచ్చింది ఎంజాయ్ చేయడానికి, తీసుకోండి" అంటూ గ్లాస్ అందించాడు, ఆయనతో ఉన్న నల్లనయ్య.

'చూడండి వాడు ఎలా వాదిస్తున్నాడో" అంటూ గ్లాస్ అందుకున్నాడు.

"దొరా, నేను ఏమీ అనలేదు, మీరే" అన్నాడు వినయంగా.

"నోర్మూయ్ అంతే" అన్నాడు సీరియస్‌గా బేరర్‌ను ఎగాదిగా చూస్తూ.

"అంతే నోర్మూయ్" అన్నాడు పార్టీ ఇచ్చే నల్లనయ్య.

"సరే" అని మూతికి చేయడ్డం ఉంచుకున్నాడు బేరర్.

"చూశారా ఇంజనీర్‌గారూ, అక్కడేమి జరుగుతుందో" అన్నాడు కాంట్రాక్టర్ చికెన్ ముక్కను నోట్లో వేసుకుంటూ.

"చూస్తున్నాను, తాగినంక ఇక తందానా" అని తలాడించాడు.

"వచ్చినోడు ఊరికే తాగిపోక రూల్స్ మాట్లాడుతున్నాడు. ఇప్పుడు చూడు అయ్యగారి

ముఖం " అంటూ విస్కీ గ్లాసును ఎత్తాడు.

"ప్రతి వాడు రూల్సే మాట్లాడతాడు. తానేమో రూల్స్ తప్పి పని చేస్తాడు. ఇంజినీర్లనే చూడండి సార్, పనప్పుడేమో పని పని అని చేయించుకుంటరు. ఎం.బి. రాసేటప్పుడు మని మని అంటుంటరు" అన్నాడు.

కాంట్రాక్టర్ మైకంలో పడిపోయాడని గ్రహించి ఇంజనీర్ నవ్వలేక, ఏడవలేక మౌనం వహించాడు.

"ఇక మీ ఇ.ఇ. ఉన్నాడు చూశావూ, వాడు పని గురించి పట్టించుకోడు, కానీ సంతకానికి పైసలు కావాలంటడు. వాడికి ఎట్లా అరుగుతదో ఏమో."

"ఆ విషయం పోనీ, తిని తాగే దగ్గర ఆ విషయాలెందుకు?" అని గ్లాసును పెదాల దగ్గర పెట్టుకున్నాడు.

"నేను అదే అంటున్నా సార్, పనిలో పది మిగిలితేనే కదా ఈ తినుడు, తాగుడు" హరికథలో పిట్టకథ చెప్పినట్టు చెప్పాడు.

"చూడు, ఊరికే మాట్లాడకు ఈ బిల్ నేనిస్తాలే" అన్నాడు గ్లాసును టేబిల్ మీద ఉంచుతూ.

పక్క టేబిల్ దగ్గర బాయ్ సోడా మూత తీయగా టప్‌మని శబ్దం వచ్చింది.

మూలన ఉన్న టేబిల్ కస్టమర్ గ్లాస్‌ను టేబిల్ మీద తడుతూ శబ్దం చేస్తూ ఉన్నాడు. బాయ్ "సార్" అంటూ పరుగులాంటి నడకతో వచ్చి ఆగాడు.

"ఏంటో అట్ల శబ్దం చేయగానే ఇట్లా వచ్చి వాలాడు, మనం ఎంత పిలిచినా రారు" అన్నాడు అటే చూస్తూ ఇంజనీర్. టిప్పు ఎక్కువిచ్చేవారిని గుర్తు పట్టి, పిలవగానే వచ్చి వాలుతారు" అన్నాడు.

ఇద్దరి మధ్యా కాసేపు మౌనం చోటు చేసుకుంది.

"చూడండి, మీకు ఎంత ఇచ్చినా పని కాగానే ఎం.బి. రికార్డ్ చేయరు. మీకు వాళ్ళకు అదే తేడా" అన్నాడు.

ఈలోపు వెయిటరొచ్చి నిలుచున్నాడు.

"సర్, ఇంకేమన్నా" అని అడిగాడు.

"ఏమయ్యా బాబు, డ్రింక్ పచ్చిగా సారాలాగుంది" అన్నాడు కాంట్రాక్టర్.

" సారాలా ఎందుకుంటుంది సార్."

" నీవెప్పుడైనా సారా తాగావా?" అడిగాడు కాంట్రాక్టర్.

"లేదు సార్"

"విస్కీ తాగావా."

"నాకసలు తాగుడు అలవాటు లేదు సార్."

"నేను రెండు తాగాను కనుకనే చెపుతున్నాను."

"సారా కూడానా, సార్" ఫేస్ చూస్తే అట్లానే ఉందిలే అనుకుంటూ.

"సరే సార్, అది కూడా డ్రింకే కదా" కాస్త వ్యంగ్యంగా అన్నాడు.

"అదిగో మళ్ళీ, నేను తాగి ఉన్నానని మాటల గారడి చేస్తున్నావురా."

"రా, గీ ఎందుకు గానీ ఏదో ఒకటి చెప్పండి" ఇంజనీర్.

"ఏమొద్దు" అన్నట్టు తలాడించాడు కాంట్రాక్టర్.

"చాలు ఏమీ వద్దు పో" అన్నాడు ఇంజనీర్.

'అమ్మ' అని శ్వాస పీలుస్తూ వెయిటర్ అక్కడి నుండి కదిలాడు.

ఇద్దరికీ అప్పుడప్పుడే మైకం ఎక్కుతోంది.

"సారా కూడా తాగినావన్నమాట" అడిగాడు ఇంజనీర్.



"ఆఁ తాగాను, ఇప్పటికీ పైసలు ఎక్కువలేని రోజున తాగుతాను."

"సారా తాగకూడదు, పైసలు లేకుంటే ఊర్కోవాలి."

"అదే, మీకు విస్కీ తాగిస్తాం, మేం సారా తాగుతాం. అయినా పైస మిగిల్చరు. ఏం చేస్తాం" కాంట్రాక్టర్ తల కిందికి వేలాడేస్తూ అన్నాడు.

"ఏం చేయొద్దు, పదపోదాం" అంటూ కుర్చీకొసకు జరిగాడు.

"ఏం చేయొద్దా, నాకు కలిసొచ్చేటట్లు చేయకపోతివో" ఈసారి తల పైకెత్తి కళ్ళను తేలగిలవేస్తూ చూపుడువేలు చూపిస్తూ అన్నాడు.

"ఏం చేస్తవ్?" వాతావరణం సీరియస్‌గా మారుతోంది.

"ఏం చేస్తానా? ఏం చేయను" సీరియస్‌గానే అన్నాడు.

"చెప్పరాదూ, ఏం చేస్తవో" కనుబొమ్మలను కదిలిస్తూ అన్నాడు.

"చెప్పను, చేస్తా, నీ నౌకరీ వూడపీకిస్తా"

"పీకిస్తవ్, పీకిస్తవ్, ఆ ఇస్తున్న పనులు ఇవ్వడం మానేస్తే నీ జుట్టు నువ్వే పీక్కుంటవ్" అంటూ లేచాడు ఇంజనీర్.

"నీ ట్రాన్స్‌ఫర్ ఖాయం" అన్నాడు ఎడమ చేతిని గాలిలో జాడిస్తూ.

" చేయించుకో పో" కుడిచేత్తో అతని ముఖాన్ని పాయింట్ చేస్తూ, తీసిపారేసినట్టు అన్నాడు.

"చూస్తాగా" అంటూ టేబిల్‌మీది బ్యాగ్‌ను చంకలోకి తీసుకున్నాడు.

"చూడు"అంటూ బండి కీని పొజిషన్‌లో పట్టుకొన్నాడు.

ఈలోపు వెయిటర్ బిల్ తెచ్చి ఉంచాడు.

ఇంజనీర్ బిల్ చూసి పర్స్ తెరిచి, సోంపు గిన్నెలో నోట్లు ఉంచాడు.

వెయిటర్ ఓసారి చూసుకొని అక్కడినుండి కదిలాడు.

"నా ట్రాన్స్‌ఫర్ అయినంకనే మళ్ళీ కలుసుకుందాం" అంటూ వెళ్ళి స్కూటర్ స్టార్ట్ చేసుకొని వెళ్ళిపోయాడు.

కాంట్రాక్టర్ మగ్గులో నుండి నీళ్ళు గ్లాసులోకి వంచుకుని గబగబా తాగాడు.

వెయిటర్ మిగిలిన చిల్లరను సాసర్‌లో వేసుకొని ఎదురొచ్చాడు.

"ఏమిటి?"

"చిల్లర."

"ఉంచుకో, అవును, బిల్ ఎవరిచ్చారు?" అతని భుజం మీద చేతులు ఉంచుతూ అడిగాడు కాంట్రాక్టర్.

"ఆయనే ఇచ్చాడు సార్."

"నీకిచ్చింది ఆయనే కానీ అవి నా డబ్బులే."

"అంటే...నాకర్థం కాలే."

"అంటే నీకర్థం కావాలని ఉందా, అయినా చెపుతున్నా, పోయినసారి కాంట్రాక్ట్ బిల్ దొరికినప్పుడు ఆయనకిచ్చినవి" అంటూ క్షణం ఆగి మరీ చెప్పాడు.

"అట్లానా."

"నాకేమి మిగలకపోయినా నా దగ్గర పర్సంటేజి వసూలు చేస్తుంటాడు" అన్నాడు వెయిటర్ వైపు చూస్తూ ముందుకు నడుస్తూ.

"వెయిటర్" పక్క టేబిల్ వాళ్ళ పిలుపు.

"సార్ పిలుస్తున్నారు సార్. వస్తా" పరుగులాంటి నడక.

"బిల్ ముట్టింది, టిప్ ముట్టింది పో," అంటూ గేటువైపు నడిచాడు.

★ ★ ★

'ఇదీ జరిగింది, ఇప్పుడు చెప్పు ,వాడితో నేనెలా మాట్లాడగలను!' అని వాపోయాడు ఇంజినీర్.

●

## పురస్కారం కోసం కథా సంపుటాలను పంపండి

గత నాలుగైదు సంవత్సరాలుగా ప్రచురించిన కథా సంపుటాలను విశాల సాహితీ కథా పురస్కారాల కోసం పంపవలసిందిగా ఆ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆగస్టు 20, 27 తేదీలలో జగిత్యాలలో జరిగే కథా రచయితల సమ్మేళనంలో ఈ పురస్కారాలు అందజేస్తారు. ఆ లోపుగానే కథా సంపుటాలను విశాల సాహిత్య అకాడమీ, 6-2-157, మిషన్ కాంపౌండ్, జగిత్యాల, కరీంనగర్-505 327 అన్న చిరునామాకు పంపవలసిందిగా ఆ సంస్థ కోరింది.